సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

మంగళవారం । 12 । డిసెంబర్ । 2023



'కారుణ్య' అభ్యర్థుల నిరసన
ఆరేళ్లుగా నియామకాలు చేపట్టడం లేదంటూ జెడ్పీకి చెందిన 'కారుణ్య' అభ్యర్థులు కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. 8లో



వారు ఆడిందే 'ఆట'..
టీఎస్ జెన్‌కో పరిధిలోని స్పోర్ట్స్ కౌన్సిళ్లు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నా ప్రశ్నించలేక క్రీడాకారులు మథన పడుతున్నారు. 10లో

వాతావరణం
గరిష్టం / కనిష్టం
28° / 18°
జిల్లాలో మంగళవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. తెల్లవారుజామున, రాత్రి చలి ప్రభావం అధికంగా ఉంటుంది.

న్యూస్‌రీల్

రామయ్యకు ముత్తంగి అలంకరణ



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి వారు ముత్తంగి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ప్రతి సోమవారం స్వామివారిని ఈ రూపంలో అలంకరించడం ప్రత్యేకత. తెల్లవారుజామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవాకాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం బేడా మండపంలో కొలువుదీర్చి విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణధారణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు.

పెద్దమ్మతల్లి ఆలయంలో రుద్రహోమం



ఉత్సవమూర్తులను తీసుకొస్తున్న భక్తులు

పాల్వంచ : మండలంలో కొలువుదీరిన శ్రీకనకదుర్గమ్మ(పెద్దమ్మతల్లి) ఆలయంలో కార్తీక మాసం, మాస శివరాత్రిని పురస్కరించుకుని సోమవారం వైభవంగా రుద్రహోమం నిర్వహించారు. మొదట మేళతాళాలు, వేద మంత్రాల నడుమ అమ్మవారి, స్వామివారి ఉత్సవ మూర్తులను దేవాలయం నుంచి యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ మండపారాధన, గణపతి పూజ జరిపిన తర్వాత రుద్రహోమం చేశారు. కార్యక్రమంలో అర్చకులతో పాటు ఆలయ ఈఓ రజనీకుమారి, ధర్మకర్త మండలి సభ్యులు చందుపట్ల శ్రీనివాసరెడ్డి, చింతా నాగరాజు, గంధం వెంగళరావు పాల్గొన్నారు.

విఘ్నేశ్వరస్వామి ఆలయంలో..




అభిషేకం చేస్తున్న ఎస్పీ దంపతులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని శ్రీవిజయ విఘ్నేశ్వరస్వామి ఆలయంలో సోమవారం మాసశివరాత్రి సందర్భంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఎస్పీ డాక్టర్ జి.వినీత్ సతీసమేతంగా ఆలయానికి వచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈఓ, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికగా, అర్చకులు ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు అందజేశారు.

మూడో లైన్ నిర్మాణ పనులతో పలు రైళ్లు రద్దు

ఖమ్మం మామిళ్లగూడెం: మూడో రైల్వే లైన్ నిర్మాణ పనుల కారణంగా దక్షిణ మధ్య రైల్వే పలు రైళ్లను రద్దుచేసింది. గుంటూరు – సికింద్రాబాద్ ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్(12705), సికింద్రాబాద్ – గుంటూరు ఇంటర్‌సిటీ(12706), విజయవాడ – సికింద్రాబాద్ శాతవాహన (12713), సికింద్రాబాద్ – విజయవాడ శాతవాహన(12714) ఎక్స్‌ప్రెస్‌లు ఈనెల 18 వరకు, తిరుపతి – ఆదిలాబాద్ కృష్ణా(17405) ఎక్స్‌ప్రెస్ 19వరకు, ఆదిలాబాద్ – తిరుపతి కృష్ణా(17406) ఎక్స్‌ప్రెస్‌ను ఈనెల 20వరకు రద్దు చేసినట్లు ఖమ్మం సీసీఐ జాఫర్ తెలిపారు. అలాగే, విజయవాడ నుండి ఖమ్మం మీదుగా నడిచే డోర్నకల్ – విజయవాడ(07755), విజయవాడ – డోర్నకల్(07756), భద్రాచలం రోడ్ – విజయవాడ(07278), విజయవాడ – భద్రాచలం రోడ్(07279) ప్యాసింజర్ రైళ్లు కూడా ఈనెల 18వరకు నడవవని పేర్కొన్నారు. ఈవిషయాన్ని ప్రయాణికులు గమనించాలని ఆయన కోరారు.

ఆశల పల్లకీలో..



ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం పూర్తయి వారం రోజులు కూడా కాకముందే రాష్ట్ర వ్యాప్తంగా 54 కార్పొరేషన్ పదవులు రద్దు చేశారు. వీటితో పాటు జిల్లా స్థాయిలోనూ నామినేటెడ్ పోస్టులు ఉన్నాయి. ప్రస్తుతం సీఎం రేవంత్ కనబరుస్తున్న దూకుడుతో అతి త్వరలోనే నామినేటెడ్ పోస్టులు భర్తీ చేస్తారనే అంచనాలు నెలకొన్నాయి. పదేళ్లుగా అధికారానికి దూరంగా ఉన్న కాంగ్రెస్ నేతలను నామినేటెడ్ పోస్టులు ఊరిస్తున్నాయి. కష్టకాలంలో పార్టీని అంటిపెట్టుకుని ఉన్న నేతలు తమ శ్రమకు తగిన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారు. – సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

'నామినేటెడ్'పై హస్తం నేతల నజర్
- పాత కార్పొరేషన్లను రద్దు చేసిన కొత్త సర్కార్
- త్వరలోనే కాంగ్రెస్ నాయకులతో పోస్టులు భర్తీ
- జిల్లా నుంచి పలువురి ప్రయత్నాలు

కొత్తగూడెం నియోజకవర్గం నుంచి..
కొత్తగూడెం నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసేందుకు మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, ఎడవల్లి కృష్ణ, నాగా సీతారాములు తీవ్రంగా ప్రయత్నించారు. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాదిన్నర ముందే కొత్తగూడెంలో క్యాంపు కార్యాలయాలు ఏర్పాటు చేసి తమ వంతు ప్రయత్నాలు ముమ్మరంగా కొనసాగించారు. అయితే చివరి నిమిషంలో కొత్తగూడెం టికెట్ సీపీఐకి కేటాయించడంతో అలకబూనిన ఎడవల్లి కృష్ణ కాంగ్రెస్‌ను వీడి బీఆర్‌ఎస్‌లో చేరారు. అంతకు కొన్ని రోజుల ముందే పోట్ల నాగేశ్వరరావు అనారోగ్య కారణాలు, పొత్తుల కారణంగా నియోజకవర్గానికి దూరమయ్యారు. ఇక టికెట్ దక్కకపోయినా, ఇతర పార్టీల నుంచి బంపర్ ఆఫర్లు వచ్చినా నాగా సీతారాములు హస్తం పార్టీని వీడలేదు. పొంగులేటి వర్గం నేతలతో కలిసి సీపీఐ అభ్యర్థి కూనంనేని సాంబశివరావు గెలుపు కోసం శ్రమించారు. ఎలాంటి క్రాస్ ఓటింగ్‌కు తావివ్వకుండా సీపీఐ గెలుపుపై ఉన్న అనుమానాలను పటాపంచలు చేశారు. దీంతో పార్టీ పరంగా త్వరలో భర్తీ చేయబోయే నామినేటెడ్ పోస్టుల్లో తనకు సముచిత స్థానం దక్కుతుందనే అంచనాల్లో ఉన్నారు. పైగా వర్గపోరుకు దూరంగా ఇటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, అటు మరోమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డితోనూ సత్సంబంధాలు కొనసాగించడం అదనపు ప్రయోజనంగా ఉంది.

పినపాకలో గుర్తింపు ఎవరికో..
పినపాక నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ తరఫున పోటీ చేసేందుకు పదిహేను మందికి పైగా అభ్యర్థులు పోటీ పడ్డారు. వీరిలో పోలెబోయిన శ్రీవాణి, బట్టా విజయ్‌గాంధీ చివరి నిమిషం వరకు తమ వంతు ప్రయత్నాలు చేశారు. అయితే చివరకు పాయం వెంకటేశ్వర్లుకే టికెట్ దక్కింది. దీంతో విజయ్‌గాంధీ రెబల్‌గా నామినేషన్ దాఖలు చేసినా, పార్టీ పెద్దల సూచనల మేరకు ఉపసంహరించుకున్నారు. ఆ తర్వాత పాయం గెలుపు కోసం రెండు వారాలు శ్రమించారు. పరిస్థితులు అన్నీ అనుకూలించి అప్పటి విప్ రేగా కాంతారావుపై పాయం ఘన విజయం సాధించారు. దీంతో బట్టా, పోలేబోయిన సైతం పార్టీ పరమైన గుర్తింపు కోసం ఎదురుచూస్తున్నారు.

ఇల్లెందులో పెద్ద జాబితానే..
అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇల్లెందు నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. అప్పటి ఎమ్మెల్యే హరిప్రియ నాయక్‌కు టికెట్ ఇవ్వొద్దంటూ గార్ల, బయ్యారం, ఇల్లెందు మండలాలకు చెందిన నాయకులు నిరసన గళం వినిపించారు. కానీ గులాబీ పెద్దలు వీరి అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. దీంతో వీరంతా బీఆర్‌ఎస్‌కు గుడ్‌బై చెప్పి జై కాంగ్రెస్ అన్నారు. ఎన్నికల ఫలితాల తర్వాత ఇల్లెందులో కాంగ్రెస్ అభ్యర్థి కోరం కనకయ్య అత్యధిక మెజార్టీతో గెలుపొందగా, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో ఇల్లెందు మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వర్లును ఇబ్బంది పెడుతున్న అవిశ్వాస ముప్పు నుంచి కొంత ఉపశమనం కలిగినట్టేనని పలువురు అభిప్రాయపడుతున్నారు. కాగా, ఈ నియోజవకర్గం నుంచి మూల మధుకర్ రెడ్డి, మేకల మల్లిబాబు, చీమల నాగరత్నమ్మ తదితరులు నామినేటెడ్ పోస్టులు ఆశించే వారిలో ఉన్నారు.

బాలసానికి అవకాశం దక్కేనా..
మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ ఎన్నికలకు ముందు బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరారు. అయితే ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థి అనూహ్యంగా ఓటమి పాలు కావడం ఆయనకు మైనస్‌గా మారింది. కాగా, మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో ఉన్న అనుబంధం కారణంగా నామినేటెడ్ పోస్టుల కేటాయింపుల్లో బాలసానిని విస్మరించే అవకాశాలు లేవని రాజకీయ విశ్లేషకుల అంచనా. ఇక అశ్వారావుపేట విషయానికి వస్తే ప్రస్తుత ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ నియోజకవర్గంలో పేరున్న నాయకులంతా కాంగ్రెస్ క్యాంపును వీడి 'కారు' ఎక్కారు. తాజా పరిస్థితులు ఈ నేతలకు మింగుడుపడటం లేదు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

ప్రజాదర్బార్‌లో దరఖాస్తులు స్వీకరించిన కలెక్టర్ ప్రియాంక



ప్రజాదర్బార్‌లో సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్ ప్రియాంక ఆల

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రజాదర్బార్‌లో సమస్యలపై వచ్చిన దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు. వచ్చిన దరఖాస్తుల్లో కొన్ని ఇలా..

- తమకు రుణాలు మంజూరు చేస్తామని యూనియన్ బ్యాంక్ మేనేజర్, ఫీల్డ్ ఆఫీసర్ ఆర్‌ఓఎఫ్‌ఆర్ పట్టాలు కలిగిన భూముల పత్రాలు తీసుకువెళ్లారని, కొన్ని గ్రామాలకు మాత్రమే రుణాలు మంజూరు చేసి తమను విస్మరించారని భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని సింగరేణి మండలం రేలకాయలపల్లి, ఫైల్‌తండా, గేట్ రేలకాయలపల్లి, మూడ్ తండా, రంగురాళ్లబోడు గ్రామాల గిరిజన రైతులు ఫిర్యాదు చేశారు. తమకు కూడా రుణాలు మంజూరు చేయాలని కోరగా, తగు చర్యల నిమిత్తం ఎల్‌బీఎంకు ఎండార్స్ చేశారు.
- తన భర్త కిడ్నీ వ్యాధితో 2019లో మరణించాడని, ప్రస్తుతం తాను, తన కుమార్తె సికిల్‌సెల్ అనీమియాతో బాధపడుతున్నామని కొత్తగూడెం మున్సిపాలిటీ పరిధిలోని ప్రకాష్‌నగర్‌కు చెందిన నిట్టా సుజాత కలెక్టర్‌కు ఇచ్చిన వినతిపత్రంలో పేర్కొంది. నిరుపేదలైన తాము ప్రతినెలా ప్రభుత్వ వైద్యం చేయించుకుంటూ జీవనం సాగిస్తున్నామని, తన కుమార్తె ల్యాబ్ టెక్నీషియన్ కోర్సు చదివినందున ఉద్యోగావకాశం కల్పించాలని వేడుకుంది. దీంతో కలెక్టర్ ఆ దరఖాస్తును డీఎంహెచ్‌ఓ శిరీషకు ఎండార్స్ చేశారు.

లక్ష్యం సాధించాలి
జిల్లాలోని అన్ని ఆస్పత్రుల్లో గర్భిణుల రిజిస్ట్రేషన్ సక్రమంగా నిర్వహించాలని, రాష్ట్ర ప్రభుత్వం సూచించిన లక్ష్యాన్ని ఆధిగమించాలని కలెక్టర్ ప్రియాంక ఆల వైద్యాధికారులకు సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. విద్యాశాఖలో పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని డీఈఓను ఆదేశించారు. మిగిలిన జిల్లా అధికారులంతా తమ శాఖల్లోని పనులను సకాలంలో పూర్తి చేయాలన్నారు. అనంతరం రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ నిర్వహించిన వీసీలో కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో 2024 జనవరి 1 , ఏప్రిల్ 1, జూలై1 , అక్టోబర్1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం నిర్వహిస్తున్నామని తెలిపారు.

బయోమెట్రిక్ వేయకుంటే గైర్హాజరే..
అధికారులు, సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేయాలని, లేదంటే విధులకు గైర్హాజరైనట్టుగా పరిగణించి వేతనం నిలిపివేస్తామని కలెక్టర్ అన్నారు. సోమవారం కలెక్టరేట్ నుంచి నిర్వహించిన వీసీలో మాట్లాడుతూ.. బయోమెట్రిక్‌లో నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రజాదర్బార్‌కు హాజరు కాని అధికారులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని ఏఓను ఆదేశించారు. అత్యవసరమైతేనే టెలీ, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహిస్తామని, ప్రతి ఒక్కరూ విధిగా హాజరు కావాలని సూచించారు. సెలవులో ఉన్నా ఫోన్ లిఫ్ట్ చేయాలన్నారు. పరిపాలనపై అధికారులు దృష్టి సారించాలని, పెండింగ్ పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఆయా సమావేశాల్లో డీఆర్‌ఓ రవీంద్రనాథ్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ శిరీష, సీపీఓ శ్రీనివాసరావు, ఇరిగేషన్ ఈఈ కాశయ్య, డీఎంఓ అలీం, డీపీఓ పి.రమాకాంత్, డీఈఓ వెంకటాచారి, ఎన్నికల తహసీల్దార్ ప్రసాద్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏర్పాట్లపై నేడు సమీక్ష
ముక్కోటి ఏకాదశి వేడుకల ఏర్పాట్లపై భద్రాచలం ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 12 గంటలకు సమీక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆల తెలిపారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. గతంలో నిర్వహించిన సమన్వయ సమావేశంలో శాఖల వారీగా అధికారులకు విధులు కేటాయించామని, సంబంధిత అధికా రులు సమగ్ర కార్యాచరణ నివేదికలతో హాజ రు కావాలని సూచించారు. సమావేశంలో డీఆ ర్‌ఓ రవీంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు.

పల్లె పోరుకు కసరత్తు

- పంచాయతీ ఎన్నికలకు అధికారుల సన్నాహాలు
- ఓటరు జాబితాలు, పోలింగ్ కేంద్రాలపై దృష్టి
- అన్నీ అనుకూలిస్తే వచ్చే నెలలోనే ఎన్నికలు !
- ప్రస్తుతం 479 పంచాయతీలు, 4,232 వార్డులు



ఓటరు జాబితాపై కసరత్తు చేస్తున్న పంచాయతీ ఉద్యోగులు (ఫైల్)

మంచుపల్లి: అసెంబ్లీ ఎన్నికలను విజయవంతంగా పూర్తి చేసిన జిల్లా అధికారులు.. ఇప్పుడు గ్రామపంచాయతీ ఎన్నికలకు కసరత్తు చేస్తున్నారు. వచ్చే ఏడాది ఫిబ్రవరి 1న ప్రస్తుత పాలకవర్గాల గడువు ముగుస్తుండడంతో ఆ లోపు పంచాయతీ ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సూచనల మేరకు వార్డుల వారీగా ఓటరు జాబితాలు సిద్ధం చేస్తున్నారు. బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ బాక్సులు, ఇతర ఎన్నికల సామగ్రి, ఎన్నికల సిబ్బంది, పోలింగ్ కేంద్రాల కేటాయింపు వంటి వాటిపై దృష్టి సారించారు. సర్పంచులు, వార్డులు, పోలింగ్ కేంద్రాల వివరాలు పంపించాలని ఈసీ నుంచి ఆదేశాలు రావడంతో రెండు, మూడు రోజులుగా అధికారులు అదే పనిలో నిమగ్నమయ్యారు. కొత్త పంచాయతీరాజ్ చట్టం – 2018 ప్రకారం గతంలో ఖరారు చేసిన రిజర్వేషన్లు పదేళ్ల పాటు కొనసాగాల్సి ఉంది. అయితే రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పాత రిజర్వేషన్లనే అమలు చేస్తారా, మార్పులు చేస్తారా అనేది తేలాల్సి ఉంది. జిల్లాలో ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలను వార్డుల వారీగా విభజించాల్సి ఉంటుంది. పంచాయతీ ఎన్నికలు పూర్తిగా బ్యాలెట్ పద్ధతిలో జరగనున్నాయి. ఈ మేరకు బ్యాలెట్ పేపర్ల ముద్రణ, బాక్స్‌ల సమీకరణ వంటి పనులు పూర్తి చేయాలి.

జిల్లాలో 479 గ్రామ పంచాయతీలు..
జిల్లాలోని 21 మండలాల పరిధిలో 479 గ్రామపంచాయతీలకు జనవరిలోపు ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. వీటి పరిధిలో 4,232 వార్డులు ఉన్నాయి. అయితే ప్రభుత్వం సారపాక, భద్రాచలాన్ని అదనపు పంచాయతీలుగా విభజించిన విషయం తెలిసిందే. వీటికి ఎన్నికల నిర్వహించేది లేనిది ఇంకా స్పష్టత రాలేదు. ఒకవేళ వాటికి సైతం ఎన్నికలు నిర్వహించాల్సి వస్తే జిల్లాలో మరో 5 పంచాయతీలు, 70 నుంచి 80 వరకు వార్డులు పెరిగే అవకాశం ఉంది. 2019 జనవరిలో 479 గ్రామపంచాయతీలు, 4,232 వార్డులకు మూడు విడతల్లో ఎన్నికలు జరిగాయి. ఒక్కో విడతలో 7 మండలాల చొప్పున ఎన్నికలు నిర్వహించారు. జనవరి 21న తొలివిడతలో 174 పంచాయతీలు, 1,534 వార్డులకు, 25న రెండో విడతలో 142 పంచాయతీలు, 1,294 వార్డులు, 30వ తేదీన మూడో విడతలో 163 గ్రామపంచాయతీలు, 1,404 వార్డులకు ఎన్నికలను నిర్వహించగా, మొత్తం 7,406 మంది సిబ్బంది విధులు నిర్వర్తించారు. ఎన్నికల కోసం 4,232 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. పంచాయతీ ఎన్నికల్లో పార్టీ గుర్తులపై అభ్యర్థులు పోటీ చేసే అవకాశం ఉండదు. ఆయా పార్టీల మద్దతుదారులు మాత్రమే సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ పడతారు. ప్రస్తుతం జిల్లాలో బీఆర్‌ఎస్ మద్దతుతో గెలుపొందిన వారే అధికంగా ఉన్నారు. అయితే ప్రస్తుతం రాష్ట్రంలో కొత్తగా కాంగ్రెస్ ప్రభుత్వం రావడంతో ఈసారి పల్లె పోరు మరింత రసవత్తరంగా మారనుందని అందరూ భావిస్తున్నారు.

ఉర్సు వేడుకలు షురూ..

- హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌లో భక్తుల పూజలు
- సందల్ సమర్పించిన మాలిక్





హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌లో పూజ చేస్తున్న భక్తులు (ఇన్‌సెట్) సందల్‌తో బయలుదేరిన భక్తులు

ఇల్లెందురూరల్: మండలంలోని సత్యనారాయణపురం హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాహ్ 21వ ఉర్సు ఉత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉత్సవాల ప్రారంభ సూచికగా పట్టణంలోని హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్‌లో ఖాసీం దుల్హాకు పూలమాల వేసి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. భారీగా బాణసంచా కాల్చి సంబురాలు జరుపుకున్నారు. అనంతరం ఈ దర్గా నుంచి నాగుల్‌మీరా దర్గాకు ప్రత్యేక వాహనంలో సందల్‌ను తరలించారు. ఏడు కిలోమీటర్ల మేర ద్విచక్రవాహన ర్యాలీతో హజరత్ నాగుల్‌మీరా మౌలా చాన్ దర్గాహ్‌కు చేరుకున్నారు. అక్కడ దర్గా మాలిక్ లక్ష్మీనారాయణ, భక్తులు సందల్‌కు ఘనంగా స్వాగతం పలికి ఊరేగింపుగా దర్గా ప్రాంగణంలోకి తీసుకెళ్లారు. హజరత్ నాగుల్ మీరా మౌలా చాన్‌కు గంధం (సందల్) సమర్పించి ధూపదీప నైవేద్యాలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలు జిల్లాల నుంచి తరలివచ్చిన నాగుల్‌మీరా భక్తులు పాల్గొన్నారు. కాగా, మంగళవారం హజరత్ ఖాసీం దుల్హా దర్గా షరీఫ్ నుంచి నాగుల్‌మీరా నిషానీ, చాదర్‌లను ప్రత్యేక జులూస్‌తో నాగుల్ మీరా దర్గాకు తరలిచేందుకు ఏర్పాట్లు చేశారు.

ఫైర్, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణ

పాల్వంచ: పాల్వంచలోని నవ లిమిటెడ్ కార్పొరేషన్ ఆధ్వర్యాన సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమాల్లో భాగంగా పలు కోర్సుల్లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు సంస్థ వైస్ ప్రెసిడెంట్ ఎల్.వీ.శరత్‌బాబు తెలిపారు. నవ ఒకేషనల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫైర్, ఇండస్ట్రియల్ సేఫ్టీ కోర్సుల్లో ఉచిత శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. డిప్లొమా, బీటెక్ పూర్తిచేసి 20నుండి 26 ఏళ్ల లోపు వయస్సు ఉన్నవారు అర్హులని, ఆరు నెలలు సాగే శిక్షణలో రూ.1,250 చొప్పున స్టైఫండ్ ఇవ్వడంతో శిక్షణ పూర్తయ్యాక ఉద్యోగావకాశాలు కూడా కల్పిస్తామని తెలిపారు. ఆసక్తి ఉన్నవారు వివరాల కోసం 94942 51018, 80969 99384 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

గిరిజన నిరుద్యోగులకు ఆన్‌లైన్ శిక్షణ

భద్రాచలంటౌన్: భద్రాచలం ఐటీడీఏ పరిధి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు కేంద్రప్రభుత్వం నిర్వహించే ఉద్యోగపోటీపరీక్షలకు ఆన్‌లైన్ శిక్షణ ఇవ్వనున్నట్లు ఐటీడీఏ పీఓ ప్రతీక్‌జైన్ తెలిపారు. రెండు నెలల పాటు నిర్వహించే ఈ శిక్షణకు 18ఏళ్లు నిండి, ఎస్సెస్సీ ఉత్తీర్ణులైన వారు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు ఈ నెల 23లోగా దరఖాస్తు చేసుకోవాలని, పూర్తి వివరాలకు ఐటీడీఏలోని భవిత కేంద్రంలో సంప్రదిచాలని సూచించారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి



సమస్యలు తెలుసుకుంటున్న అధికారులు

భద్రాచలం: ప్రభుత్వ సంక్షేమ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలని ఐటీడీఏ ఏపీఓ జనరల్ డేవిడ్‌రాజ్ అన్నారు. సోమవారం ఐటీడీఏలో నిర్వహించిన గిరిజన దర్బార్‌లో ప్రజల సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. వాటిని పరిశీలించి అర్హతల మేరకు సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గిరిజనుల సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం అనేక పథకాలను అందుబాటులోకి తెచ్చిందని తెలిపారు. ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని గిరిజనులకు సూచించారు. కాగా, దర్బార్‌లో పోడు భూములు, పట్టాలు, రైతుబంధు, ఇతర స్వయం ఉపాధి పథకాల మంజూరు వంటి సమస్యలపై పలువురు దరఖాస్తులు అందజేశారు. చర్ల మండలం కుదునూరు గ్రామపంచాయతీ సర్పంచ్ వీరాపురం గ్రామానికి తాగునీటి సౌకర్యం కల్పించాలని వినతిపత్రం అందించారు. కరకగూడెం మండలం రేగళ్లలో విద్యుత్ సౌకర్యం ఏర్పాటుచేయాలని గ్రామస్తులు విన్నవించారు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ మణెమ్మ, ఈఈ తానాజీ, ఎస్‌ఓ సురేష్ బాబు, ఆర్‌ఓఎఫ్‌ఆర్ డీటీ శ్రీనివాస్, ఏపీఓ(పవర్) మునీర్ పాషా, డీఎస్ ఓ ప్రభాకర్‌రావు, జేడీఎం హరికృష్ణ, ఉద్యాన అధి కారి అశోక్, మేనేజర్ ఆదినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా భగవద్గీత కంఠస్థ పోటీలు

కొత్తగూడెంఅర్బన్: జిల్లా స్థాయి భగవద్గీత కంఠస్థ పోటీలను కొత్తగూడెంలోని విశ్వహిందూ పరిషత్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. పోటీలకు స్థానిక సంస్కృత, తెలుగు ఉపాధ్యాయులు, అధ్యాపకులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. నాలుగు విభాగాల్లో గెలుపొందిన విద్యార్థులకు వీహెచ్‌పీ తెలంగాణ ప్రాంత సంఘటన్ కార్యదర్శి ముదుపు యాదిరెడ్డి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ తెలంగాణ ప్రాంత మందిర అర్చక పురోహిత్ సహ ప్రముఖ్ సురేష్‌కుమార్, ఖమ్మం విభాగ్ కార్యదర్శి పెరిక బాలాజీ, ఖమ్మం విభాగ్ సంఘటన కార్యదర్శి గడదేశి వెంకటేశ్వర్లు, ఖమ్మం విభాగ్ బజరంగదళ్ సంయోజక్ రాములోనియా, జిల్లా అధ్యక్షుడు చిలుకూరి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు దారా రమేష్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ



పతకాలు చూపిస్తున్న విద్యార్థులు

పాల్వంచ : ఈ నెల 9, 10 తేదీల్లో హైదరాబాద్‌లోని డీఏవీ పబ్లిక్ స్కూల్‌లో నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి క్రీడా పోటీల్లో పాల్వంచ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చారు. డీఏవీ సౌత్ జోన్ నుంచి 50 పాఠశాలల విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో అండర్ -14 బ్యాడ్మింటన్, అండర్ -17 బాలికల విభాగాల్లో ప్రథమ, అండర్ – 14 చెస్ బాలుర విభాగంలో ద్వితీయ, అండర్ – 14 బాస్కెట్‌బాల్ బాలికల విభాగంలో ద్వితీయ, అండర్ – 17 బాలికల బాస్కెట్‌బాల్ విభాగంలో ద్వితీయ, అండర్ – 17 టేబుల్ టెన్నిస్ బాలుర విభాగంలో ద్వితీయ స్థానాల్లో బహుమతులు సాధించారు. జనవరి 4 నుంచి 8 వరకు ఢిల్లీలో జరిగే డీఏవీ నేషనల్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్‌కు పాల్వంచకు చెందిన రిత్విక, పి.దీపిక, భవన సత్య, కె.లక్ష్మి, త్రివేణి, అబ్దుల్ రూఫ్, హర్షవర్ధన్, సుమంత్, జగదీశ్ నాయక్, రిఫత్ జహాన్, మనస్విని, కల్యాణి, అనిత, స్నేహాంకిత, చందన, ఓం కారుణ్య, యశ్విత నాయక్ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా సోమవారం ప్రిన్సిపాల్ ఏ.రామారావు, పీఈటీలు ఎ.శ్యాం, ఆర్.రవికుమార్, డి.రామస్వామి దాస్ విద్యార్థులను అభినందించారు.

క్లుప్తంగా

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక



జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రతిభచూపారు. జాతీయస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారు. సోమవారం కళాశాలలో వారిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ కత్తి రమేష్ మాట్లాడుతూ ఈ నెల 7 నుంచి 9వ తేదీ వరకు హనుమకొండలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నలుగురు విద్యార్థులు పతకాలు సాధించారని తెలిపారు. ఈ నెల 20న మహారాష్ట్రలో జరిగే జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వివరించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన ఎం.అఖిల్, జి.వరుణ్, ఎండి.రియాజ్‌పాష, ఎం.ప్రేమ్‌కుమార్‌లను అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల లెక్చరర్లు సముద్రాల శ్రీనివాస్, బండి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



వాలీబాల్ పోటీలకు ఎంపికైన అన్వేష్

దుమ్ముగూడెం : మండలంలోని కొత్తపల్లి బాలుర ఆశ్రమ పాఠశాల 9వ తరగతి విద్యార్థి నూపా అన్వేష్ రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికయ్యాడు. కొత్తగూడెంలో జరిగిన అండర్-14 జూనియర్ పాఠశాల స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తా చూపి ఉమ్మడి ఖమ్మం జిల్లా జట్టుకు కెప్టెన్‌గా ఎంపికయ్యాడు. ఈ నెల 13,14,15 తేదీలలో మహబూబ్‌నగర్ జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నాడు. విద్యార్థిని సోమవారం ఏటీడీఓ పూనెం నరసింహారావు, హెచ్‌ఎం మడకం మోతిరు, ఉపాధ్యాయులు కారం సర్వేశ్, హరికృష్ణ అభినందించారు.

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై ఫిర్యాదు



ఫిర్యాదుపత్రంతో ప్రదీప్‌కుమార్

భద్రాచలంఅర్బన్: భద్రాచలం నియోజకవర్గంలోని గిరిజన, గిరిజనేతర ప్రజలకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని ఆరోపిస్తూ ఆయనపై భద్రాచలం ఏఎస్ఆర్ కాలనీకి చెందిన పూనెం ప్రదీప్‌కుమార్ సోమవారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ముఖ్యమంత్రి హోదాలో 2016లో భద్రాచలం పర్యటనకు వచ్చిన కేసీఆర్ రామాలయ అభివృద్ధికి రూ.100 కోట్ల నిధులు ప్రకటించినా ఇవ్వలేదని, గత ఏడాది వరదల సమయంలో వచ్చినప్పుడు ముంపు నివారణకు రూ.వెయ్యి కోట్లు ఇస్తామని ప్రకటించినా ఇవ్వకుండా మోసం చేశారని పేర్కొన్నారు. ఏజెన్సీ ప్రాంత ప్రజలను, భద్రాద్రి రామయ్యను మోసం చేసిన మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌తో పాటు మాజీ ఆర్థిక శాఖ మంత్రి తన్నీరు హరీశ్ రావుపై తక్షణమే అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ప్రదీప్‌కుమార్ పోలీసులను కోరారు.

సింగరేణి ఎన్నికలకు 21 పోలింగ్ కేంద్రాలు

జిల్లాలో 5 కౌంటింగ్ బూత్‌ల ఏర్పాటు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 27న సీక్రెట్ బ్యాలెట్ విధానం ద్వారా సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు నిర్వహించనున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక సంఘాలు డీవైసీఎల్సీకి సమర్పించిన కార్మికుల జాబితాను వెరిఫికేషన్ చేసిన అనంతరం సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో 84 పోలింగ్ కేంద్రాలు, 12 కౌంటింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు. కొత్తగూడెం రీజియన్(భద్రాది జిల్లా)లో 21 పోలింగ్ కేంద్రాలు, 5కౌంటింగ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. కార్పొరేట్ ఏరియాలో ఐదు బూత్‌లు, కొత్తగూడెం ఏరియాలో 6, ఇల్లెందు ఏరియాలో 3, మణుగూరు ఏరియాలో 7 బూత్‌లు ఏర్పాటు చేయనున్నారు. ఏరియాకు ఒకటి చొప్పున కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నారు. కొత్తగూడెంలో రుద్రంపూర్ ఆర్‌సీఓఏ క్లబ్‌లో, కార్పొరేట్ ఏరియాలో సింగరేణి హెడ్డాఫీస్ న్యూ కాన్ఫరెన్స్ హాల్‌లో, ఇల్లెందులో 24 ఇంక్లైన్ కమ్యూనిటీ హాల్‌లో, మణుగూరులో పీవీ కాలనీ కమ్యూనిటీ హాల్‌లో, హైదరాబాద్ సింగరేణి భవన్‌లో 3వ అంతస్తులో కౌంటింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన లారీ

కొణిజర్ల: అదుపుతప్పిన లారీ చెట్టును ఢీకొట్టిన ఘటన మండలంలోని శాంతినగర్ సమీపాన సోమవారం జరిగింది. ఒడిస్సా రాష్ట్రానికి చెందిన లారీ వైరా వైపు వెళ్తుండగా అదుపు తప్పి రోడ్డు పక్కకు దూసుకెళ్లి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో ఎవరూ గాయపడకున్నా లారీ క్యాబిన్ నుజ్జయింది. క్రేన్ సాయంతో లారీని బయటకు తీసిన స్థానికులు.. స్వల్పంగా గాయపడ్డ డ్రైవర్‌ను ఆస్పత్రికి తరలించారు.

ఓటరు నమోదుకు మరో అవకాశం



- ఈనెల 20నుంచి దరఖాస్తుల స్వీకరణ
- జనవరి 6న ముసాయిదా, ఫిబ్రవరి 8న తుది జాబితా విడుదల
- వచ్చే నెల 1 నాటికి 18 ఏళ్లు నిండే వారంతా అర్హులే
- మార్పులు, చేర్పులకు కూడా వెసులుబాటు

సుజాతనగర్/ఖమ్మం సహకారనగర్: ఓటరుగా నమోదు చేసుకునేందుకు కేంద్ర ఎన్నికల సంఘం మరో అవకాశాన్ని కల్పించింది. త్వరలో గ్రామపంచాయతీ, లోక్‌సభ ఎన్నికలు జరగనుండడంతో ప్రక్రియ మొదలుపెట్టారు. ఏటా ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ ప్రకటిస్తోంది. ఇటీవల అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా పలుమార్లు అవకాశమిచ్చారు. అర్హులైన వారి నుంచి దరఖాస్తులు స్వీకరించి, అక్టోబర్‌లో తుది జాబితా ప్రకటించగా నవంబర్ రెండో వారంలో అనుసంధాన జాబితా విడుదల చేశారు. ఈ జాబితా ఆధారంగా అసెంబ్లీ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకునే వెసులుబాటు కల్పించారు.

జనవరి 5వరకు గడువు

ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లావ్యాప్తంగా ఈనెల 20 నుంచి ఓటరు జాబితా సవరణ చేపట్టనున్నారు. బూత్ స్థాయి అధికారులు(బీఎల్వో) ఇంటింటికీ వెళ్లి కొత్త దరఖాస్తులతోపాటు మార్పులు, సవరణలకు వివరాలు సేకరిస్తారు. ఈ ప్రక్రియ జనవరి 5వ తేదీ వరకు కొనసాగుతుంది. అదేనెల 6వ తేదీన ముసాయిదా జాబితా ప్రకటిస్తారు. ఈ జాబితాపై 22వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తారు. బీఎల్వోలు మరోసారి సర్వే చేపట్టి పరిష్కరిస్తారు. 2024 ఫిబ్రవరి 2న జాబితా పరిశీలించి, అదేనెల 8న తుది ఓటరు జాబితా ప్రకటిస్తారు.

వచ్చే నెల 1వరకు...

ఓటరు జాబితాలో పేరు లేనివారు కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం ఉంది. 2024 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులని ఎన్నికల సంఘం వెల్లడించింది. సీఈఓ వెబ్‌సైట్ ద్వారా కానీ స్థానికంగా ఉండే బీఎల్వో వద్ద కానీ ఫాం-6 ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఫిబ్రవరిలో ఇచ్చే తుది జాబితాలో పేరు ఉంటేనే లోక్‌సభ ఎన్నికల్లో ఓటుహక్కు వినియోగించుకోవచ్చు.

ప్రత్యేక క్యాంపెయిన్

పోలింగ్ బూత్ స్థాయిలో ఓటరు నమోదుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహించనున్నారు. శని, ఆదివారాలు ప్రత్యేకంగా కార్యక్రమం జరుగుతుంది. ఈ షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం త్వరలోనే ప్రకటించనుంది. స్థానికంగా ఉండేవారు కొత్తగా నమోదుతోపాటు మార్పులు, చేర్పులు, తొలగింపు కోసం బీఎల్వోలకు దరఖాస్తులు అందించాల్సి ఉంటుంది.

భద్రాద్రి జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
పినపాక	97,821	1,00,577	04	1,98,402
ఇల్లెందు	1,07,909	1,11,658	02	2,19,569
కొత్తగూడెం	1,18,385	1,25,434	27	2,43,846
అశ్వారావుపేట	76,193	79,761	07	1,55,961
భద్రాచలం	71,437	77,220	04	1,48,661
మొత్తం	4,71,745	4,94,650	44	9,66,439

ఖమ్మం జిల్లాలో నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	మహిళలు	ఇతరులు	మొత్తం
ఖమ్మం	1,54,978	1,67,969	49	3,22,996
సత్తుపల్లి	1,18,885	1,24,225	08	2,43,118
పాలేరు	1,14,134	1,22,148	05	2,36,287
మధిర	1,07,111	1,14,206	09	2,21,326
వైరా	94,057	99,005	07	1,93,069
మొత్తం	5,89,165	6,27,553	78	12,16,796

ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయం

- మహిళా సాధికారతకు కృషి
- ఎమ్మెల్యేలు పాయం, కోరం, జారె



అశ్వారావుపేట: పోస్టర్లు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఆదినారాయణ తదితరులు



మణుగూరులో జెండా ఊపి మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు



ఇల్లెందు : బస్టాండ్‌లో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

ఇల్లెందు/అశ్వారావుపేట/మణుగూరు రూరల్ : ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా పనిచేస్తామని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణ పేర్కొన్నారు. సోమవారం వారు ఆయా నియోజకవర్గాల పరిధిలో మహాలక్ష్మి పథకాన్ని ప్రారంభించారు. రాజీవ్ ఆరోగ్య శ్రీ నగదు పెంపునకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద కుటుంబాలకు రూ.10 లక్షల వరకు ఆరోగ్య బీమా కల్పించినట్లు తెలిపారు. దివంగత సీఎం డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి ప్రవేశపెట్టిన ఈ పథకం ఇప్పటికీ పేదలకు ఎంతో ఉపయోపడుతోందని అన్నారు. ప్రజలకు మెరుగైన వైద్య సేవలందిస్తామని చెప్పారు. మహిళల సాధికారత కోసం మహాలక్ష్మి పథకం ప్రవేశపెట్టామని, మహిళలందరికీ ఉచితంగాఆర్టీసీ బస్సుల్లో ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు వివరించారు. అనంతరం అధికారులు ఎమ్మెల్యేలను ఘనంగా సన్మానించారు. అశ్వారావుపేట ఎమ్మెల్యే తొలుత ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు.

ఇల్లెందులో..

ఇల్లెందులో జరిగిన కార్యక్రమాల్లో అధికారులు వెంకటేశ్వర్లు, సంజీవరాణి, రవిబాబు, వెంకన్న, హర్షవర్ధన్, మరియన్న, సుకృత, రవికుమార్, మున్సిపల్ చైర్మన్ దమ్మాలపాటి వెంకటేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు దానియేల్, పులి సైదులు, తాటి భిక్షం, శ్రీనివాస్, యదళ్లపల్లి అనసూర్య, స్వరూప, ఆరెం కిరణ్, అనిల్, సర్పంచ్‌లు, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

మణుగూరులో..

మణుగూరులో కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య, టీపీసీసీ మెంబర్ చందా సంతోష్, నాయకులు కాటబోయిన నాగేశ్వరరావు, తోలెం నాగేశ్వరరావు, పి.నవీన్, ఆర్టీసీ డీఎం స్వామి, అశ్వాపురం ఎంపీపీ ముత్తినేని సుజాత, వైస్ ఎంపీపీ కేవీరావు, పుచ్చకాయల శంకర్, సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్, సామా శ్రీనివాసరెడ్డి, పాలమూరి రాజు, గుడిపూడి కోటేశ్వరరావు, బచ్చల భారతి, అధికారులు మధుసూదన రాజు, హరిప్రసాద్, నరేష్, సునీల్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేటలో..

అశ్వారావుపేటలో జరిగిన కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు చిన్నంశెట్టి వరలక్ష్మి, సర్పంచ్‌లు అట్టం రమ్య, నార్లపాటి సుమతి, సొసైటీ చైర్మన్ సీహెచ్ సత్యనారాయణ, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పూర్ణచంద్రరావు, కాంగ్రెస్ నాయకులు జూపల్లి రమేష్, జూపల్లి ప్రమోద్, నండ్రు రమేష్, కేధర్‌నాథ్, అల్లాడి రామారావు, ఎంపీటీసీలు మిండా హరి, వేముల భారతి, ఎస్ తిరుమల పాల్గొన్నారు.

● నగర సంకీర్తన



అగ్నిగుండం వద్ద పూజలు చేస్తున్న భక్తులు



నగర సంకీర్తనలో నృత్యాలు చేస్తున్న స్వాములు

పట్టణంలోని రైటర్‌బస్తీలో ఉన్న శ్రీధర్మశాస్తా ఆలయం కార్యదర్శి, గురుస్వామి కన్నెగంటి కృష్ణయ్య ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అయ్యప్ప స్వాముల నగర సంకీర్తన నిర్వహించారు. తొలుత ఆలయంలో అగ్నిగుండం ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయం నుంచి బస్టాండ్ సెంటర్, సూపర్‌బజార్, గణేష్‌టెంపుల్ మీదుగా ప్రదర్శన జరిపారు. అయ్యప్ప మాలధారుల భజనలు, నృత్యాలతో సందడి చేశారు. – కొత్తగూడెంఅర్బన్

3.5 కేజీల గంజాయి స్వాధీనం

భద్రాచలంటౌన్: అక్రమంగా తరలిస్తున్న నిషేధిత గంజాయిని ఎక్సైజ్ అధికారులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ సర్వేశ్వరరావు కథనం ప్రకారం.. స్థానిక ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టణంలో సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో బ్రిడ్జి సెంటర్‌లో ఓ బైక్‌ను తనిఖీ చేసి 3.5 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులు, హైదరాబాద్‌కు చెందిన గొల్లపల్లి శివ, నవీన్‌లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఏపీలోని సీలేరు నుంచి హైదరాబాద్ గంజాయి తరలిస్తున్నట్లు తేలింది. నిందితులను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. గంజాయి, బైక్‌ను సీజ్ చేసినట్లు సీఐ తెలిపారు. ఎస్ఐ అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.



పట్టుబడిన గంజాయి, నిందితులను చూపిస్తున్న అధికారులు

ప్రలోభాలకు గురికావొద్దు

టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ అధ్యక్షుడు వెంకట్రావు

సింగరేణి(కొత్తగూడెం): ఈ నెల 27న సింగరేణిలో జరిగే ఏడో దఫా గుర్తింపు సంఘం ఎన్నికల్లో ధైర్యంగా ముందుకు సాగాలని టీబీజీకేఎస్ అధ్యక్షుడు బి.వెంకట్రావు సూచించారు. సోమవారం రాత్రి కార్పొరేట్ ఏరియా పరిధిలోని టీబీజీకేఎస్ కార్యాలయంలో 5 ఏరియాల ఉపాధ్యక్షులు, కార్యకర్తలతో ఏర్పాటు చేసిన ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. శ్రేణులు అధైర్యపడొద్దని, ప్రలోభాలకు లోనుకాకుండా గెలుపే ధ్యేయంగా పనిచేయాలని సూచించారు. ప్రతిపక్ష యూనియన్ల కేడర్ గనికి ఒక్కరు,ఇద్దరు మాత్రమే ఉన్నారని, తమకు మాత్రం మైన్స్, జీఎం, సేఫ్టీ, టెంపుల్ కమిటీల సభ్యులు ఉన్నారని తెలిపారు. వారిని కాపాడుకుంటే గెలుపు మనదేనని అన్నారు. ఇటీవల ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయిన నేపథ్యంలో యూనియన్ పరిస్థితి ఏమిటనే ఆందోళన వద్దని చెప్పారు. జాతీయ కార్మిక సంఘాలు పోగొట్టిన డిపెండెంట్ ఉద్యోగాల సాధనతోపాటు, కోలిండియాలోలేని అనేక హక్కులు కార్మికులకు సాధించిపెట్టామని పేర్కొన్నారు. త్వరలో ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేస్తామన్నారు. ఈ సందర్భంగా వివిధ ఏరియాల నాయకులు, కార్యకర్తలు తమ సమస్యలను యూనియన్ నాయకుల దృష్టికి తెచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి మిరియాల రాజిరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ కెంగెర్ల మల్లయ్య, కార్పొరేట్ ఉపాధ్యక్షుడు సోమిరెడ్డి, ఏరియా ఉపాధ్యక్షుడు ఎండీ రజాక్, రంగానాథ్, బడికెల సమ్మయ్య, కాపు కృష్ణ, లక్ష్మీనర్సమ్మ, రవూఫ్, సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మా హయాంలోనే సంక్షేమం

జాతీయ కార్మిక సంఘాల తీరుతో 25 ఏళ్ల కిందట కోల్పోయిన వారసత్వ ఉద్యోగాలను సాధించిన ఘనత టీబీజీకేఎస్‌దేనని సంఘం అధ్యక్షుడు బి.వెంకట్రావ్ తెలిపారు. కొత్తగూడెం ఏరియా పరిధి పీవీకే-5 షాఫ్ట్‌లో సోమవారం జరిగిన పిట్ సమావేశంలో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ గుర్తింపు సంఘంగా ఎన్నికయ్యాకే కార్మికులకు హక్కులు లభించడంతో పాటు లాభాల వాటా పెరిగిందని తెలిపారు. రానున్న గుర్తింపు సంఘం ఎన్నికల్లో మరోమారు గెలిపించాలని కోరారు.

కనకదుర్గమ్మ ఆలయంలో మంత్రి పొంగులేటి పూజలు

ఘనస్వాగతం పలికిన ఎంపీ మిథున్‌రెడ్డి



మంత్రి పొంగులేటిని సత్కరిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు

ఖమ్మంవన్‌టౌన్: ఏపీలోని విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మ తల్లిని తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి – మాధురి దంపతులు సోమవారం దర్శించుకున్నారు. మంత్రి సోదరుడు పొంగులేటి ప్రసాదరెడ్డి – శ్రీలక్ష్మి దంపతులు కూడా వారి వెంట ఉన్నారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజల అనంతరం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి తెలుగు రాష్ట్రాల ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన తర్వాత అమ్మవారిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. కాగా, పొంగులేటిని ఏపీకి చెందిన ఎంపీ మిథున్‌రెడ్డి, ఆలయ కమిటీ బాధ్యులు స్వాగతించి, పూజల అనంతరం ఆలయ మర్యాదలతో సత్కరించారు.

'కారుణ్య' అభ్యర్థుల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన తెలుపుతున్న అభ్యర్థులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ఆరేళ్ల నుంచి నియామకాలు చేపట్టకుండా జాప్యం చేస్తున్నారంటూ జిల్లా పరిషత్‌కు చెందిన కారుణ్య నియామక అభ్యర్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అనేకసార్లు విన్నవించినా ఎవరూ పట్టించుకోవడంలేదని వాపోయారు. గత ప్రభుత్వం ఆగస్టులో 1,266 ఆఫీస్ సబార్డినేట్ పోస్టులను జూనియర్ అసిస్టెంట్‌లుగా అప్‌గ్రేడ్ చేసి రాష్ట్రంలోని వివిధ శాఖలకు చెందిన తమలాంటి అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చిందని తెలిపారు. కానీ జిల్లా పరిషత్‌కు చెందిన తమకు మాత్రం స్థానిక సంస్థలకు చెందిన అభ్యర్థులు అనే పేరుతో నిరాశకు గురిచేసిందని ఆవేదనవ్యక్తం చేశారు. ఇతర జిల్లాల్లో కూడా జెడ్పీ కారుణ్య అభ్యర్థులకు ఉద్యోగాలు ఇచ్చారని పేర్కొన్నారు. భద్రాద్రి జిల్లాకు మంజూరైన 45 పోస్టులలో 14 ఖాళీగా ఉన్నాయని, తాము 11మంది మాత్రమే ఉన్నామని, అయినా ఉద్యోగాలు ఇవ్వడం లేదని ఆరోపించారు. తమను ప్రభుత్వం ఆదుకోకపోతే ఆత్మహత్యలే శరణ్యమని హెచ్చరించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో అభ్యర్థులు దీపిక, రోహిణి, వసంత, ప్రవంతి, సాయిప్రసాద్, జయంత్, షాదాబ్ పాల్గొన్నారు.

అభ్యర్థులను ఆదుకోవాలి

చుంచుపల్లి: ఆరేళ్లుగా ఎదురుచూస్తున్న జిల్లా పరిషత్ పరిధిలోని కారుణ్య నియామక అభ్యర్థులకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని పలువురు కోరారు. ఈ సందర్భంగా సోమవారం జెడ్పీ చైర్మన్ కంచర్ల చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. గతంలో తమపై చిన్న చూపు చూడటంతో నియామకాలు జరగక ఇబ్బంది పడ్డామని తెలిపారు. వినతిపత్రం అందజేసిన వారిలో వసంత, రోహిణి, దీపిక, ప్రవంతి, సాయిప్రసాద్, జయంత్, షాదాబ్ తదితరులు ఉన్నారు.

జలమయంగా శ్మశానవాటిక



శ్మశానవాటికలో చేరిన నీటిని చూపెడుతున్న సర్పంచ్, గ్రామస్తులు

సుజాతనగర్: సింగరేణి పైపుల లీకేజీ కారణంగా తమ ప్రాంతంలోని శ్మశానవాటిక జలమయం అవుతోందని 2 ఇంక్‌లైన్ గ్రామ ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం వారు విలేకరుల ఎదుట వివరాలు వెల్లడించారు. ఈ ప్రాంతంలో ఫిల్టర్ చేసిన నీటిని రామవరం, త్రీ ఇంక్‌లైన్, ఫోర్ ఇంక్లైన్ తదితర ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారని తెలిపారు. సుమారు 50, 60 ఏళ్ల క్రితం క్రితం వేసిన పైపులు కావడంతో తరచూ లీకై సమాధుల్లోకి నీళ్లు వస్తున్నాయని పేర్కొన్నారు. సింగరేణి అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. శ్మశానవాటికలో తరచూ నీళ్లు రావడంతో మృతి చెందిన వారిని ఖననం చేయడం ఇబ్బందికరంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో సర్పంచ్ గుగులోత్ నగేష్, ఉప సర్పంచ్ సింగిరాల రమేష్, గ్రామస్తులు అంకుష్, రాజు, రవి, కళ్యాణ్, క్రాంతి, రాము, అర్జున్, చారి, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత

దుమ్ముగూడెం : మండలంలోని చింతగుప్ప గ్రామంలో అక్రమంగా నిల్వ చేసిన కలపను అటవీశాఖ టాస్క్‌ఫోర్స్ అధికారులు సోమవారం పట్టుకున్నారు. చింతగుప్ప గ్రామ పరిసరాల్లో రూ.78,373 విలువైన కలప దాచి ఉంచగా, అధికారులు గుర్తించి, భద్రాచలం రేంజ్ కార్యాలయానికి తరలించారు. అటవీశాఖ అధికారులు ప్రసాదరావు, కనకమ్మ, శోభన్‌నాయక్, విజయ తదితరులు పాల్గొన్నారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య



జనపరాజు(ఫైల్)

గుండాల: తండ్రి మందలించాడని మనస్తాపం చెంది ఓ యువకుడు పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన సోమవారం చోటుచేసుకుంది. మండలంలో కొడవటంచ గ్రామానికి చెందిన ఈసం జనపరాజు(28) ఇటీవల కాలంలో మద్యం తాగుతూ జులాయిగా తిరుగుతున్నాడు. దీంతో తండ్రి ఆదివారం మందలించగా, మనస్తాపం చెంది, అదే రోజు రాత్రి పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు గుండాల ఆస్పత్రికి, అక్కడి నుంచి కొత్తగూడెం తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు ఎస్సై రాజశేఖర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్‌లో చోరీలు



సీసీ కెమెరాలో నిక్షిప్తమైన చోరీ దృశ్యం

పాల్వంచ: దొంగలు సోమవారం తెల్లవారుజామున నాలుగు గంటల సమయంలో రెండు షాపుల్లో చోరీలకు పాల్పడ్డారు. స్థానికుల కథనం ప్రకారం... పట్టణంలోని మార్కెట్ ఏరియాలో ఉన్న రాజ శ్రీ మ్యాచింగ్ సెంటర్, సాయినాథ్ ఎంటర్ ప్రైజెస్ షాపుల షట్టర్లను ఇనుప రాడ్లతో పైకి వంచి లోపలికి ప్రవేశించారు. షాపుల్లో కౌంటర్ సొరుగుల్లో ఉన్న సుమారు రూ.5 వేల నగదు వరకు చోరీ చేశారు.

బైక్ అపహరణ

భజన మందిర రామాలయం సమీపంలోని ఓ ఇంట్లో అద్దెకు ఉంటున్న బి.కుమార్ తన పల్సర్ బైక్‌ను ఇంటి ముందు పార్క్ చేశాడు. కాగా దొంగలు ఆ బైక్‌ను అపహరించారు. ముగ్గురు వ్యక్తులు ఈ చోరీలకు పాల్పడినట్లు సీసీ పుటేజీల ద్వారా గుర్తించారు. సంఘటనా స్థలాలను ఎస్ఐ బి.రాము పరిశీలించారు. బైక్ చోరీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

మట్టి ట్రాక్టర్లు సీజ్



అధికారులు పట్టుకున్న ట్రాక్టర్లు

అశ్వారావుపేటరూరల్: అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సోమవారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. మండలంలోని వేదాంతపురం అటవీ ప్రాంతం నుంచి కొందరు వ్యక్తులు అనుమతి లేకుండా మట్టి తరలిస్తుండగా దొంతికుంట వద్ద అధికారులు పట్టుకుని తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. మూడు వాహనాలను సీజ్ చేసినట్లు ఆర్ఐ కృష్ణ తెలిపారు.

క్లుప్తంగా...

కొత్తగా 850 ఎంబీబీఎస్ సీట్లు



వచ్చే విద్యా సంవత్సరంలో అందుబాటులోకి..

సాక్షి, అమరావతి: వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఏపీలో మరో 850 వైద్య సీట్లను అందుబాటులోకి తెచ్చేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ విద్యా సంవత్సరం రాష్ట్ర ప్రభుత్వం ఐదు నూతన వైద్య కళాశాలలను ప్రారంభించడం ద్వారా 750 సీట్లను ఇప్పటికే అందుబాటులోకి తెచ్చిన విషయం తెలిసిందే. 2024–25 విద్యా సంవత్సరం నుంచి పాడేరు, పులివెందుల, ఆదోని, మార్కాపురం, మదనపల్లె వైద్య కళాశాలలను ప్రభుత్వం ప్రారంభించనుంది. ఐదు చోట్ల వైద్య విధాన పరిషత్ ఆస్పత్రులను బోధనాస్పత్రులుగా అభివృద్ధి చేయడంతో పాటు, వైద్య కళాశాలలకు 222, బోధనాస్పత్రికి 484 చొప్పున 3,530 పోస్టులను మంజూరు చేశారు. ఈ పోస్టుల భర్తీ ప్రక్రియ దాదాపు పూర్తయింది. ఒక్కోచోట 150 చొప్పున 750 సీట్ల కోసం నేషనల్ మెడికల్ కమిషన్(ఎన్ఎంసీ)కు దరఖాస్తు చేశారు. మరోవైపు అనంతపురం వైద్య కళాశాలలో 50, నెల్లూరు, శ్రీకాకుళం కళాశాలల్లో ఒక్కో చోట 25 చొప్పున 50 ఎంబీబీఎస్ సీట్ల పెంపునకు దరఖాస్తు చేశారు. ప్రస్తుతం అనంతపురంలో 150, శ్రీకాకుళంలో 175, నెల్లూరులో 175 సీట్లున్నాయి.

ఆర్టీసీ ఉద్యోగులకు తీపి కబురు

జీతాలతోపాటు అలవెన్సుల చెల్లింపు

సాక్షి, అమరావతి: ఆర్టీసీ ఉద్యోగులకు ఏపీ ప్రభుత్వం మరో తీపి కబురు అందించింది. ఉద్యోగులకు ప్రతి నెలా జీతాలతోపాటు అలవెన్సులు కూడా కలిపి చెల్లించాలని నిర్ణయించింది. 'పే ఇన్ టు'లో డ్యూటీ బేస్డ్ అలవెన్సులను జీతాలతోపాటు కలిపి చెల్లించనుంది. వచ్చే నెల నైట్ అవుట్, డే అవుట్ అలవెన్సులు, ఓవర్ టైమ్ అలవెన్సులను జీతాలతో పాటు చెల్లించనున్నారు. దాంతో దాదాపు 50వేలమంది ఆర్టీసీ ఉద్యోగులకు ప్రయోజనం కలగనుంది. అదేవిధంగా ఆర్టీసీ ఉద్యోగులకు 2017 పీఆర్సీ బకాయిలు, ఎస్ఆర్బీఎస్ ట్రస్ట్‌కు చెల్లించాల్సిన మొత్తాన్ని కూడా త్వరలోనే దశలవారీగా చెల్లించాలని నిర్ణయించింది. అలాగే క్రమశిక్షణ చర్యలపై ఆర్టీసీ ఉద్యోగులు అప్పీల్ చేసేందుకు.. తదనంతరం సత్వరం పరిష్కరించేలా విధి విధానాలను రూపొందించాలని ప్రభుత్వం ఆదేశించింది. దానిపై రూపొందించిన ముసాయిదాను న్యాయశాఖ పరిశీలనకు పంపారు. త్వరలోనే క్రమశిక్షణ చర్యలపై ప్రత్యేకంగా అప్పీళ్లకు అవకాశం కల్పిస్తూ ప్రభుత్వం విధి విధానాలను ఖరారు చేయనుంది.

సామాజిక న్యాయంతో | కొత్త సమన్వయకర్తలు

- 11 నియోజకవర్గాలకు కొత్తవారిని నియమించిన సీఎం జగన్
- మంగళగిరిలో ఆళ్ల స్థానంలో సమన్వయకర్తగా గంజి చిరంజీవి
- గాజువాకలో దేవన్‌రెడ్డి స్థానంలో బీసీ వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావు
- గుంటూరు పశ్చిమ సమన్వయకర్తగా మంత్రి విడదల రజని
- చిలకలూరిపేట సమన్వయకర్తగా మల్లెల రాజేష్‌నాయుడు

ముగ్గురు మంత్రులకు స్థానచలనం



ఆదిమూలపు సురేష్ (కొండెపి)



మేరుగు నాగార్జున (సంతనూతలపాడు)



విడదల రజని (గుంటూరు పశ్చిమ)

సాక్షి, అమరావతి: సామాజిక న్యాయం అనేది నినాదం కాదు.. అనుసరించాల్సిన విధానమని వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి చాటిచెప్పారు. కేబినెట్ నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సింహభాగం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు ఇచ్చి రాజ్యాధికారంలో వాటా కల్పించి సామాజిక న్యాయమంటే ఇదీ అని దేశానికి చాటిచెప్పిన సీఎం జగన్ తాజాగా 11 నియోజకవర్గాలకు నూతన సమన్వయకర్తల నియామకంలోనూ అదే విధానాన్ని పాటించారు. ప్రస్తుతం అగ్రవర్ణాలకు చెందిన ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న రెండు నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలుగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వారిని నియమించారు. మంత్రులు విడదల రజని, మేరుగు నాగార్జున, ఆదిమూలపు సురేష్‌లు ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాలను మార్పు చేశారు.

మరింత మెరుగైన ఫలితాలే లక్ష్యంగా..

ఎన్నికల్లో 175 స్థానాల్లోనూ విజయమే లక్ష్యంగా పార్టీ శ్రేణులను సీఎం వైఎస్ జగన్ సమాయత్తం చేస్తున్నారు. అన్ని నియోజకవర్గాల్లో రాజకీయ పరిస్థితులను శాస్త్రీయంగా, క్షుణ్ణంగా అధ్యయనం చేస్తూ మరింత మెరుగైన ఫలితాలు సాధించడమే లక్ష్యంగా, సామాజిక న్యాయానికి పెద్దపీట వేస్తూ మార్పుచేర్పులు చేస్తున్నారు. ఈ క్రమంలో 11 నియజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో ఆ నియోజకవర్గ సమన్వయకర్తగా చేనేత సామాజిక వర్గానికి చెందిన గంజి చిరంజీవిని సీఎం జగన్ నియమించారు. గాజువాక ఎమ్మెల్యే తిప్పల గురుమూర్తిరెడ్డి కుమారుడు, నియోజకవర్గ సమన్వయర్త దేవన్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేయడంతో ఆ స్థానంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన వరికూటి రామచంద్రరావును నియమించారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్తగా బీసీ సామాజిక వర్గానికి చెందిన వైద్యారోగ్య శాఖ మంత్రి విడదల రజినిని నియమించారు. ఆమె ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్న చిలకలూరిపేట నియోజకవర్గ సమన్వయకర్తగా కాపు సామాజిక వర్గానికి చెందిన మల్లెల రాజేష్‌నాయుడిని నియమించారు.

కొత్త సమన్వయకర్తలు వీరే..

1.ప్రత్తిపాడు(ఎస్సీ)– బాలసాని కిరణ్‌కుమార్
2.కొండెపి(ఎస్సీ) – డాక్టర్ ఆదిమూలపు సురేష్
3.వేమూరు(ఎస్సీ) – వరికూటి అశోక్‌బాబు
4.తాడికొండ(ఎస్సీ) – మేకతోటి సుచరిత
5.సంతనూతలపాడు(ఎస్సీ) – డాక్టర్ మేరుగు నాగార్జున
6.చిలకలూరిపేట – మల్లెల రాజేష్‌నాయుడు
7.గుంటూరు పశ్చిమ – విడదల రజని
8.అద్దంకి – పాణెం హనిమిరెడ్డి
9.మంగళగిరి – గంజి చిరంజీవి
10.రేపల్లె – డాక్టర్ ఈవూరు గణేష్
11.గాజువాక – వరికూటి రామచంద్రరావు

మెరుగైన ఫలితాల కోసమే మార్పులు

11 నియోజక వర్గాలకు కొత్త సమన్వయకర్తల నియామకంపై మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల

సాక్షి, అమరావతి: ఏపీలో 175 స్థానాల్లోనూ గెలుపే లక్ష్యంగా ఏ నియోజక వర్గానికి ఎవరిని పార్టీ సమన్వయకర్త(ఇన్‌ఛార్జ్)గా నియమించాలో శాస్త్రీయంగా అధ్యయనం చేసిన అనంతరం మార్పులు చేర్పులకు వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం చుట్టారు. ఈ క్రమంలో సోమవారం 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం వద్ద విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి ఆ వివరాలను ప్రకటించారు. మంగళవారం నుంచి 11 నియోజవర్గాల్లో పార్టీ వ్యవహారాలన్నీ కొత్తగా నియమితులైన సమన్వయకర్తలే పర్యవేక్షిస్తారని తెలిపారు. వచ్చే ఎన్నికల్లో మెరుగైన ఫలితాల కోసమే ఈ మార్పులని, భవిష్యత్తులోనూ ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చని వారు స్పష్టం చేశారు. బొత్స మాట్లాడుతూ.. ఏ ఒక్కరినీ పార్టీ వదులుకోదని, అందరి సేవలను వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. గత నాలుగున్నరేళ్లుగా సీఎం జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు సామాజిక న్యాయం చేస్తూ వారికి ధైర్యాన్ని, స్థైర్యాన్ని ఇచ్చారన్నారు. సామాజిక సాధికారతను చేతల్లో చూపించారన్నారు. అణగారిన వర్గాలకు మరింతగా మంచి చేయాలంటే పార్టీ మళ్లీ అధికారంలోకి రావాలన్నారు. భవిష్యత్తులోనూ అన్ని నియోజకవర్గాల్లో పరిస్థితులను సమీక్షించుకుంటూ అవసరాన్ని బట్టి ఇన్‌ఛార్జ్‌ల మార్పు చేర్పులపై తగిన నిర్ణయాలు తీసుకుంటారని చెప్పారు. గంజి చిరంజీవిని పార్టీలో చేర్పించింది మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డేనని మంత్రి బొత్స గుర్తు చేశారు. మంగళగిరి నియోజకవర్గ పార్టీ సమన్వకర్తగా చిరంజీవిని సీఎం జగన్ నియమించారన్నారు. పార్టీలో ఆళ్ల రామకృష్ణారెడ్డికి సముచిత స్థానం ఇస్తారని చెప్పారు. పార్టీ ఏ ఒక్కరినీ వదులుకోబోదని, ఎవరి సేవలు ఎక్కడ అవసరమో అక్కడ వినియోగించుకుంటుందని స్పష్టం చేశారు. ఈ మార్పుల వల్ల కొందరికి బాధ ఉండవచ్చని, అయితే అందరూ సీఎం జగన్ నిర్ణయాలను అర్థం చేసుకుని పార్టీకి సహకరిస్తారన్నారు. సజ్జల మాట్లాడుతూ.. ''సీఎం జగన్ వైఎస్సార్‌సీపీని స్థాపించిన నాటి నుంచి పార్టీని ప్రజలకు జవాబుదారీగా ఉంచారు.
సీఎం జగన్ దృష్టిలో శాసనసభ్యుడికి ఎంత విలువ ఉంటుందో కార్యకర్తకూ అంతే విలువ ఉంటుంది. ప్రజలతో మమేకమై వారి మనసులు చూరగొని ఆశీస్సులు పొంది ఎవరు రాణిస్తారో ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ నిర్ణయాలు తీసుకుంటామని సీఎం జగన్ మొదటి నుంచి చెబుతున్నారు. ఈ క్రమంలోనే 11 నియోజకవర్గాలకు కొత్త సమన్వయకర్తలను నియమించారు. భారీ మెజార్టీతో గెలవాలన్న ఆలోచనతోనే మార్పులు చేశారు. భవిష్యత్తులో ఇలాంటి నిర్ణయాలు ఉండవచ్చు.. ఉండకపోవచ్చు కూడా! పార్టీ ఒక వ్యక్తి కోసమో.. వ్యక్తుల కోసమో ఉండదు. ఎవరికైనా ఇబ్బంది ఉంటే కూర్చోబెట్టి మాట్లాడతాం. ఎందుకు మార్పు చేశామనేది అంతర్గతంగా వారికి వివరిస్తాం''అని పేర్కొన్నారు.

వ్యక్తిగత కారణాలతోనే రాజకీయాలకు ఎమ్మెల్యే ఆర్కే దూరం

సీఎం వైఎస్ జగన్ వెంటే రామకృష్ణారెడ్డి: ఎంపీ అయోధ్య రామిరెడ్డి



సాక్షి, అమరావతి/మంగళగిరి: తన సోదరుడు, మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే) వ్యక్తిగత కారణాలతో రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్‌సీపీ ప్రాంతీయ సమన్వయకర్త ఆళ్ల అయోధ్య రామిరెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే పదవికి, పార్టీకి ఆర్కే రాజీనామా చేయడంపై ఆయన స్పందించారు. ఆర్కేకు ఎలాంటి అసంతృప్తి లేదని, సీఎం జగన్ వెంటే నడుస్తారని స్పష్టం చేశారు. తాడేపల్లిలో సీఎం క్యాంపు కార్యాలయం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఆర్కేకు కొన్ని అంచనాలు ఉన్నాయని, వాటిని అందుకోలేక రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించుకున్నారని వివరించారు. మంగళగిరి నియోజకవర్గంలో బీసీ సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థికి అవకాశం ఇవ్వాలని సీఎం జగన్ మొదటి నుంచి భావించారని, ఆ క్రమంలోనే సమన్వయకర్తగా గంజి చిరంజీవిని నియమించారని చెప్పారు.

వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా: ఆర్కే



తాను వ్యక్తిగత కారణాలతోనే రాజీనామా చేస్తున్నానని మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) తెలిపారు. ఆయన సోమవారం అసెంబ్లీకి వెళ్లి స్పీకర్ ఓఎస్డీకి రాజీనామా అందించిన అనంతరం మంగళగిరిలో విలేకరులతో మాట్లాడారు. 1995 నుంచి రాజకీయాలలో ఉంటూ దివంగత వైఎస్సార్ అనుచరుడిగా కొనసాగానన్నారు. 2004, 2009లలో కాంగ్రెస్ నుంచి పెదకూరపాడు టిక్కెట్ ఆశించి భంగపడ్డానన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెంట నడిచి 2014, 2019లలో మంగళగిరి ప్రజల ఆశీస్సులతో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యేగా విజయం సాధించానన్నారు. అవినీతికి తావులేకుండా నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి రాష్ట్రానికే ఆదర్శంగా తీర్చిదిద్దానని చెప్పారు.

రంగస్థలానికి పూర్వ వైభవం

- 23 నుంచి గుంటూరులో ఏపీ 'నంది నాటకోత్సవాలు'
- ఏపీఎఫ్‌డీసీ చైర్మన్ పోసాని కృష్ణమురళి



సాక్షి, అమరావతి: తెలుగు నాటక రంగ స్థలానికి పూర్వవైభవం తీసుకొచ్చే సంకల్పంతో గుంటూరులో ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు '22వ నంది నాటకోత్సవాల'ను నిర్వహిస్తున్నట్లు ఏపీ చలన చిత్ర, టీవీ, నాటక రంగాభివృద్ధి సంస్థ చైర్మన్ పోసాని కృష్ణమురళి తెలిపారు. సోమవారం విజయవాడలో మీడియాతో ఆయన మాట్లాడుతూ.. పద్య, సాంఘిక నాటకాలు, నాటికలు, బాలల నాటిక, కళాశాల /వర్సిటీ నాటిక (ప్లేలెట్స్)కు 115 ఎంట్రీలు వచ్చాయన్నారు. వీటిల్లో ప్రాథమిక పరిశీలన అనంతరం 38 ప్రదర్శనలను తుది పోటీలకు ఎంపిక చేశామన్నారు. ఐదు విభాగాల్లో 74 అవార్డులను అందజేయనున్నట్లు పోసాని వివరించారు. ప్రతి రోజూ ఉదయం 9.30 నుంచి రాత్రి 10 గంటల వరకు నాటక ప్రదర్శనలు కొనసాగుతాయన్నారు. ఐదు విభాగాల్లో స్వర్ణ, రజత, కాంస్య నంది బహుమతుల కోసం జరిగే పోటీల్లో ఒక్కోదానిలో ముగ్గురు చొప్పున మొత్తం 15 మంది న్యాయనిర్ణేతలు ఉత్తమ ప్రదర్శనలను ఎంపిక చేస్తారని తెలిపారు. దీంతో పాటు 2022లో నాటక రంగంపై 'ఉత్తమ రచన గ్రంథం'ఎంపిక కోసం మరో ముగ్గురు జడ్జిలతో కమిటీని నియమించామన్నారు.

నామినేషన్లకు గడువు పొడిగింపు

ప్రభుత్వం నాటక రంగ విస్తరణకు ఎనలేని ప్రోత్సాహం అందిస్తోందన్నారు. నంది నాటకోత్సవాల వేదికపై 'ఎన్టీఆర్ రంగస్థల పురస్కారం'పేరుతో నాటక రంగంలో వ్యక్తిగత విభాగంలో విశేష సేవలందించిన నటులు, కళాకారులకు రూ.1.50 లక్షల నగదు బహుమతిని ప్రదానం చేస్తోందన్నారు. దీంతో పాటు సమష్టి కృషితో పనిచేసిన నాటక సమాజాలకు, పరిషత్తులను ప్రోత్సహించేందుకు తొలిసారిగా వైఎస్సార్ రంగస్థల పురస్కారాన్ని ప్రదానం చేస్తూ.. రూ.5లక్షల బహుమతి, మెమెంటోతో సత్కరిస్తామన్నారు. ఈ అవార్డుల నామినేషన్ల గడువును ఈ నెల 20వ తేదీ వరకు పొడిగిస్తున్నట్లు వెల్లడించారు. వచ్చే ఏడాది నుంచి బాలలు, కళాశాల విద్యార్థి నాటకాల విభాగాల్లోనూ వ్యక్తిగత బహుమతులను అందజేస్తామన్నారు.

జిల్లా వార్తలు

పారదర్శకత కోసమే వెబ్ కౌన్సిలింగ్



కొత్తగూడెంలో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థలో ఇంటర్నల్ క్లర్క్‌ల బదిలీలు పారదర్శంగా చేపట్టడానికే నాలుగు చోట్ల వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించామని సంస్థ కార్పొరేట్ హెచ్ఆర్డీ జీఎం బి.వెంకటేశ్వరరావు తెలిపారు. కొత్తగూడెంలోని ప్రధాన కార్యాలయంతో పాటు ఆర్జీ–1లోని టీటీసీ, శ్రీ రాంపూర్, బెల్లంపల్లి ఏరియాల్లో సోమవారం సీనియర్ క్లర్క్‌ల బదిలీల కోసం వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా కొత్తగూడెంలో జీఎం మాట్లాడుతూ ఎవరూ నష్టపోకుండా సీనియారిటీ ఆధారంగా బదిలీలు జరిగేలా చర్యలు చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు బి.రవికుమార్, శ్రీనివాస్ విలాస్ పొద్దార్, సీవీవీఎస్.మూర్తి, వై.శంకర్‌రెడ్డి, నాగదీప, కె.శ్రీనివాస్, కె.శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సత్తా



ఎం.అనూష



భార్గవనాయుడు

ఖమ్మం స్పోర్ట్స్: సౌత్ వెస్ట్ జోన్ రాష్ట్రాల పరిధి వెయిట్‌లిఫ్టింగ్ పోటీల్లో ఖమ్మంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల విద్యార్థులు సత్తా చాటారు. ఏపీలోని రాజమండ్రి ఆదికవి నన్నయ యూనివర్సిటీలో జరుగుతున్న వెయిట్‌లిఫ్టింగ్ పోటీల మహిళల విభాగంలో ఎం.అనూష 72 కేజీల విభాగంలో స్వర్ణపతకం సాధించగా, పురుషుల విభాగంలో భార్గవనాయుడు 102 కేజీల కేటగిరీలో రజత పతకం సాధించాడు. వీరిద్దరు ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ వెయిట్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్‌కు అర్హత సాధించారు. ఈసందర్భంగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్, సెక్రటరీ కోట అప్పిరెడ్డి, చైర్మన్ ఎం.నిరంజన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వీ.రమణారావు, పీడీ జె.ఉపేందర్, కోచ్ డి.వినోద్‌కుమార్ అభినందించారు.

వారు ఆడిందే 'ఆట'..



కేటీపీఎస్ 5, 6వ దశల స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యాలయం



కేటీపీఎస్ ఓఅండ్ఎం, 7వ దశ స్పోర్ట్స్ కౌన్సిల్ కార్యాలయం

జెన్‌కో స్పోర్ట్స్ కౌన్సిళ్లకు ఎన్నికలు కరువు

- ఏకపక్షంగా మారిన స్పోర్ట్స్ కౌన్సిళ్ల తీరు
- కేటీపీఎస్ 5, 6, 7 దశల్లో ఏళ్ల తరబడి ఒకే కౌన్సిల్ కొనసాగింపు
- ఏకగ్రీవంగా నిర్వహిస్తుండడంతో అర్హులకు దక్కని చోటు
- కొత్త వారికి అవకాశం రావడం లేదని విమర్శలు..
- పట్టించుకోని ఉన్నతస్థాయి అధికారులు

పాల్వంచ: టీఎస్ జెన్‌కో పరిధిలో క్రీడాకారులను అన్ని విధాల యాజమాన్యం ప్రోత్సహిస్తుంది. వారికి అవసరమైన సదుపాయాలు, క్రీడా సామగ్రి, క్రీడామైదానాలు, వాటి నిర్వహణ చేయడంతో పాటు వారికి ప్రత్యేక నిధులు కేటాయించి ఎక్కడా ఎలాంటి లోటుపాట్లు లేకుండా వారికి సహకారం అందిస్తోంది. అయితే కర్మాగారాల వారిగా స్పోర్ట్స్ కౌన్సిళ్ల తీరు మాత్రం ఏకపక్షంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రెండేళ్లకోసారి స్పోర్ట్స్ కౌన్సిళ్లకు ఎన్నికలు నిర్వహించి మార్పు చేయాల్సి ఉండగా, ఏళ్ల తరబడి అధికారులను స్పోర్ట్స్ కౌన్సిల్ సెక్రటరీలు ప్రసన్నం చేసుకుని ఇనానిమస్‌గా ప్రకటించుకుంటున్నారు. దీన్ని ప్రశ్నించలేక క్రీడాకారులు మదన పడుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. జెన్‌కోలో మొత్తం 8 హైడల్ స్టేషన్లు, 4 థర్మల్ స్టేషన్లు ఉండగా.. పాల్వంచలో కేటీపీఎస్ 5, 6, 7 దశల కర్మాగారాలు ఉన్నాయి. ఇక్కడ ఉన్న సుమారు 200 మంది క్రీడాకారుల్లో చాలా మంది జాతీయ స్థాయి క్రీడాకారులుగా గుర్తింపు తెచ్చుకున్నారు.

కనుమరుగవుతున్న పలు క్రీడలు..

జెన్‌కోలో ప్రతీ ఏటా టీఎస్‌జెన్‌కో ఇంటర్ ప్రాజెక్ట్స్ క్రీడా పోటీలు నిర్వహిస్తుండగా.. ఒక్కో కర్మాగారంలో కొన్నిరకాల క్రీడలను నిర్వహిస్తారు. కొన్ని చోట్ల కల్చరల్ పోటీలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇవన్నీ ఇప్పుడు నామమాత్రంగా నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. అన్ని క్రీడల్లోనూ ప్రతీసారి పాతవారే ఉంటున్నారని, కొత్త క్రీడాకారులు తయారుకావడం లేదని, ఇందుకు స్పోర్ట్స్ కౌన్సిళ్లలో సరైన ప్రోత్సాహం కరువైందనే ఆరోపణలు ఉన్నాయి. నాలుగేళ్ల క్రితం క్యారమ్స్‌లో వెళ్లిన వారు మాత్రమే తప్ప ఇటీవల కాలంలో జాతీయ స్థాయిలో ఆడిన క్రీడాకారులే లేరని.. కేవలం రాష్ట్ర స్థాయిల్లో ఆడుతుండడం పరిపాటిగా మారింది. దీంతో ఇక పలు రకాల క్రీడలు కరుమరుగవుతుండగా.. అథ్లెటిక్స్ క్రీడలైన రన్నింగ్, జావెలిన్ త్రో, షాట్‌పుట్, లాంగ్ జంప్, 300, 400 మీటర్ల రన్నింగ్ తదితర క్రీడల జాడే లేదు. ఇక సాంస్కృతిక కార్యక్రమాలను అసలే నిర్వహించడం లేదు. కర్మాగారంలో ఏదైన కార్యక్రమాలు ఉంటే కేటీపీఎస్ డీఏవీ పాఠశాలల్లోని విద్యార్థులతో నృత్యాలు చేయిస్తున్నారు.

ఏళ్ల తరబడిగా కౌన్సిళ్ల కొనసాగింపు..

ప్రతీ కర్మాగారానికి ఉండే స్పోర్ట్స్ కౌన్సిల్‌కు చైర్మన్, ప్రెసిడెంట్‌గా చీఫ్ ఇంజనీర్ లేదా సూపరింటెండెంట్ ఇంజనీర్లు ఉంటారు. ఇక స్పోర్ట్స్ సెక్రటరీ, ఆర్గనైజింగ్ సెక్రటరీ, ట్రెజరర్ పోస్టులకు ప్రతీ రెండేళ్లకోసారి ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. నోటిఫికేషన్ ఇచ్చి పోటీలో ఉండే వారి పేర్లను తీసుకుని, అభ్యర్థుల్లో క్రీడాకారులకు నచ్చిన వారిని ఎన్నుకోవాల్సి ఉంటుంది. అయితే కేటీపీఎస్ ఓఅండ్ఎం, 7వ దశలో ఉన్న జెన్‌కో సెక్రటరీ పోస్టులో గత 13 ఏళ్లుగా, 5, 6వ దశల కర్మాగారాల్లో ఉన్న పోస్టులో 2015 నుంచి కొనసాగుతున్నట్లు స్థానిక క్రీడాకారులు వాపోతున్నారు. ఇలా ఉన్నత స్థాయి అధికారులను ప్రసన్నం చేసుకుంటు ఏళ్ల తరబడి ఆయా పోస్టుల్లో తిష్టవేస్తూ ఇనానిమస్‌గా ఎన్నికై నట్లు చూపిస్తున్నారని ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. ఫలితంగా అర్హత ఉన్న క్రీడాకారులు ఆ పోస్టుల్లోకి రాలేకపోవడంతో పాటు నోటిఫికేషన్ ఇవ్వకపోవడంతో కొత్తవారికి అవకాశం లేకుండా పోతోందని క్రీడాకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా విద్యుత్ కళాభారతి

కేటీపీఎస్ విద్యుత్ కళాభారతి క్రీడామైదానం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. ఇక్కడ ఆటలు ఆడే సమయాన మాత్రమే రూ.లక్షలు వచ్చించి మైదానాన్ని శుభ్రం చేయించి ఆపై వదిలేస్తుండడంతో తర్వాత క్రీడలు వచ్చేప్పటికీ మైదానమంతా గడ్డి పెరిగి అపరిశుభ్రంగా మారుతోంది. రోజు వారీగా క్రీడాకారులు ప్రాక్టీస్ చేసుకునేలా ప్రోత్సాహం కరువైంది. దీంతో క్రీడాకారులకు ప్రాక్టీస్ చేసుకోకపోవడంతో పాటు మందుబాబులు, గంజాయి సేవించే వారికి అడ్డాగా మారిందని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా ప్రతీ రెండేళ్లకోసారి స్పోర్ట్స్ కౌన్సిల్‌లో కొత్త వారికి చోటు ఇవ్వడంతో పాటు దీనిపై మక్కువ ఉన్న వారికి పోస్టులు కట్టబెట్టాలని, ఎన్నికలు నిర్వహించాలని కాంప్లెక్స్‌లోని క్రీడాకారులు కోరుతున్నారు. ఈ విషయమై కేటీపీఎస్ 7వ దశ సీఈ పి.వెంకటేశ్వరరావును వివరణ కోరేందుకు ప్రయత్నించగా అందుబాటులో లేరు.

కొన్నేళ్లుగా పాత వారే కొనసాగుతున్నారు..



స్పోర్ట్స్ కౌన్సిల్ అనేది సేవా దృక్పథంతో నడుస్తుంది. ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ కొన్నేళ్లుగా పాత వారినే కొనసాగిస్తున్నారు. పోటీకి ఎవరైనా వస్తే ఎన్నిక ప్రక్రియ నిర్వహించాల్సి ఉంటుంది. కానీ ఎవరూ రాకపోవడంతో ఎన్నికలు జరగగా పాతవారినే కొనసాగిస్తున్నారని అనుకుంటున్నా.

– ఎం.ప్రభాకర్ రావు, కేటీపీఎస్ 5, 6వ దశల సీఈ

1.30 లక్షల మంది మహిళల ప్రయాణం

ఖమ్మంమామిళ్లగూడెం/చుంచుపల్లి: ఆర్టీసీలో మహాలక్ష్మి పేరిట మహిళలకు ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించగా విశేష స్పందన వస్తోంది. ఈ పథకాన్ని శనివారం ప్రారంభించగా, ఆదివారం సెలవుదినం, కార్తీక మాసం చివరి సోమవారం రద్దీ పెరిగింది. దీంతో బస్టాండ్లు కిక్కిరిసి కనిపించగా, పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్ బస్సుల కోసం మహిళలు వేచి ఉండడం కనిపించింది. ఈమేరకు ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు ఖమ్మం రీజియన్‌లోని ఏడు డిపోల పరిధిలో సోమవారం సాయంత్రం వరకు 1.30 లక్షల మంది మహిళలు ఉచిత ప్రయాణం చేసినట్లు అధికారులు తెలిపారు. కాగా, ప్రస్తుతం ఎలాంటి గుర్తింపు కార్డు లేకున్నా మహిళలను అనుమతిస్తుండగా, విధివిధానాలు వచ్చేవరకు ఇలానే కొనసాగించనున్నట్లు అధికారులు వెల్లడించారు.



కొత్తగూడెం బస్టాండ్‌లో మహిళల రద్దీ

సుశీలకు మరో అవార్డు

కొత్తగూడెం రూరల్: రాష్ట్రపతి అవార్డు గ్రహీత, భద్రాద్రి జిల్లాకు చెందిన ఏఎన్ఎం తేజావత్ సుశీలను రేడియో రంజన్ సంస్థ 'బెస్ట్ మెడికల్ సర్వీస్' అవార్డుతో సత్కరించింది. గుంటూరులో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఏఎన్ఎం సుశీలను సన్మానించడంతో పాటు అవార్డు అందించారు. ఈ కార్యక్రమంలో గుంటూరు తూర్పు ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫా, గుంటూరుకు చెందిన వైద్యాధికారులు పాల్గొన్నారు. గత ఆరేళ్లుగా వివిధ విభాగాల్లో ఉత్తమ సేవలు అందించిన వారిని రేడియో రంజన్ సన్మానిస్తుండగా, ఈ ఏడాది తెలంగాణ నుంచి భద్రాద్రి జిల్లాకు చెందిన సుశీల ఎంపికయ్యారు.



సన్మానం అందుకున్న తేజావత్ సుశీల

ఎంసీహెచ్‌ఓలో పనిచేయని లిఫ్ట్





ర్యాంప్ మీదుగా రాకపోకలు సాగిస్తున్న గర్భిణులు, బాలింతలు (ఇన్‌సెట్) పనిచేయని లిఫ్ట్

ఇబ్బందులు పడుతున్న బాలింతలు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలోని మాతా శిశు ఆరోగ్య కేంద్రం(ఎంసీహెచ్)లో కొన్నాళ్లుగా లిఫ్ట్ పని చేయడం లేదు. ఒకవేళ పనిచేసినా తరచూ మొరాయిస్తుండడం సర్వసాధారణమై పోయింది. అయినా అధికారులు మరమ్మతులపై దృష్టి సారించడం లేదు. ఫలితంగా బాలింతలు, గర్భిణులు, వారి సహాయకులకు ఇబ్బందులు తప్పట్లేదు. డిశ్చార్జ్ అయి వెళ్లేటప్పుడు చిన్నపిల్లలను ఎత్తుకుని ర్యాంప్‌పై రాకపోకలు సాగించేందుకు బాలింతలు అవస్థ పడుతున్నారు. ఇకనైనా అధికారులు లిఫ్ట్ మరమ్మతుపై దృష్టి సారించాలని వారు కోరుతున్నారు.